సాక్షి
అనంతపురం
శనివారం । 28 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.31,100

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.31,100 పలికాయి.



'సచివాలయ' బదిలీల్లో గందరగోళం

నగరపాలక సంస్థ, మున్సిపల్ పరిధిలోని సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో స్పష్టత లేకపోవడంతో గందరగోళం నెలకొంది.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.6°/23.8°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రూ.3.03 కోట్ల విలువజేసే సెల్‌ఫోన్ల అందజేత



బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: 'చాట్‌బాట్' ద్వారా అందిన ఫిర్యాదుల ఆధారంగా రికవరీ చేసిన రూ.3.03 కోట్ల విలువ చేసే 1,216 మొబైల్ ఫోన్లను శుక్రవారం అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన మేళాలో ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా అందజేశారు. ఇప్పటి వరకు జిల్లా పోలీసు శాఖ 12,594 మొబైల్ ఫోన్లను అందజేసింది. వీటిన్నింటి విలువ రూ.24.11 కోట్లు అని పోలీసుల శాఖ పేర్కొంది. పోయిన ఫోన్లు తిరిగి చేతికి అందడంతో బాధితుల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లాలో ప్రజల మొబైల్ ఫోన్లు చోరీకి గురైనా.. అవి ఇతర రాష్ట్రాలకు చేరినా రికవరీ విషయంలో జిల్లా పోలీసులు రాజీ పడలేదు. ఇప్పటి వరకు రికవరీ చేసిన 12,594 ఫోన్లలో దేశ వ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో బాధితులకు ముట్టజెప్పిన ఫోన్లు 1179, మన రాష్ట్రంలో అనంతపురం జిల్లా కాకుండా తక్కిన జిల్లాల్లో 2,795 ఫోన్లు అందజేశారు. అందజేసిన మొబైల్ ఫోన్ విలువ రూ.499 నుంచి రూ.1,41,000 వరకు ఉంది. 2022 జూన్ 26న జిల్లా పోలీసు శాఖ 'చాట్ బాట్' సేవలు ప్రారంభించి.. చోరీకి గురైనా లేదా మిస్ అయినా మొబైల్ ఫోన్ల జాడ కనుక్కొని రికవరీ చేసి ప్రజలకు అందజేస్తోంది. సెల్‌ఫోన్ దుకాణం నిర్వాహకులైనా, వ్యక్తులైనా ఎవరైనా సరే అపరిచితులు అమ్మే ఫోన్లను కొనుగోలు చేయొద్దని ఎస్పీ సూచించారు. అమ్మేవారు పరిచయస్తులైనా సరే బిల్లులు, సంబంధిత మొబైల్ ఫోన్ వివరాలు కలిగిన బాక్సు ఉంటే కొనుగోలు చేయాలని తెలిపారు.

10 నుంచి హెచ్చెల్సీకి నీటి విడుదల

బొమ్మనహాళ్: తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు జూలై పదో తేదీన నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. శుక్రవారం బెంగళూరులోని విధాన సౌధ సమావేశ మందిరంలో 124వ ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. హెచ్చెల్సీకి జూలై పది నుంచి 31వ తేదీ వరకు సగటున 700 క్యూసెక్కులు, ఆగస్టు ఒకటి నుంచి నవంబర్ 30 వరకు 1,300 క్యూసెక్కుల చొప్పున విడుదల చేయనున్నారు. తుంగభద్ర జలాశయానికి ఉన్న 33 క్రస్ట్ గేట్లలో 19వ క్రస్ట్ గేటు గతేడాది కొట్టుకుపోవడం, మిగిలిన 32 గేట్లు కూడా దెబ్బతినడం వల్ల నిపుణుల సూచన మేరకు వాటిని మార్చాలని టీబీ బోర్డు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో గేట్ల అంచు వరకు 80 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయాలని నిబంధన పెట్టారు. టీబీడ్యాంకు 157 టీఎంసీల నీరు చేరుతాయని అంచనా వేసిన అధికారులు.. వాటా ప్రకారం వివిధ కాలువలకు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

పోటెత్తిన వరద

తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తింది. ప్రస్తుతం 44,569 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా.. డ్యాంలో 57 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు. ఎగువన ఉన్న శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి , చిక్కమంగళూరు, వరనాడుతో పాటు జలాశయం పరిసరాల్లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో మరింత పెరగనున్నట్లు అధికారులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్లకు గాయాలు



బోల్తాపడిన తుఫాన్ వాహనం

ఉరవకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయులు గాయపడ్డారు. అనంతపురం నుంచి 15 మంది ఉపాధ్యాయులు పాల్తూరు వరకు గల వివిధ పాఠశాలల్లో విధులకు వెళ్లేందుకు శుక్రవారం తుఫాన్ వాహనంలో బయల్దేరారు. ఉరవకొండ మండలం కోనాపురం సమీపంలోకి రాగానే పొలంలోంచి ఓ ట్రాక్టర్ ఉన్నపళంగా రోడ్డుపైకి వచ్చింది. దాన్ని తప్పించేందుకు ప్రయత్నించి తుఫాన్ వాహన డ్రైవర్ కుడివైపునకు తిప్పబోయాడు. ఈ క్రమంలో అదుపుతప్పి వాహనం బోల్తాపడింది. ఇద్దరు ఉపాధ్యాయులు తీవ్రంగా, మరో 13 మంది స్వల్పంగా గాయపడ్డారు. ఆ వెనుకే మరో వాహనంలో వస్తున్న ఇతర ఉపాధ్యాయులు వెంటనే 108 సిబ్బందికి సమాచారమందించి గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.





మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, చిత్రంలో ఎంపీ మిథున్‌రెడ్డి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు అనంత, ఉషశ్రీ, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్ కుమార్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, సమన్వయకర్తలు శైలజానాథ్, రంగయ్య, వై.వెంకటరామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

బాబు మోసాలు వివరిద్దాం

- హామీల అమలులో ఘోరంగా విఫలం
- బెదిరింపులు, కేసులకు భయపడేది లేదు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల

బుక్కరాయసముద్రం/శింగనమల: చంద్రబాబు ఏడాది పాలనలో హామీలు అమలు చేయకుండా ప్రజలకు చేసిన మోసాలను లెక్కలతో సహా వివరిద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రెడ్‌బుక్ మాటున సాగిస్తున్న అరాచకాలకు, బెదిరింపులకు భయపడేది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. శింగనమల నియోజకవర్గానికి సంబంధించి బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ఇదే వేదిక నుంచి 'రీ కాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, అనంతపురం, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి, రమేష్‌రెడ్డి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉషశ్రీచరణ్, నియోజకవర్గ సమన్వయకర్తలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, మెట్టు గోవింద



వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, చిత్రంలో శైలజానాథ్

రెడ్డి, తలారి రంగయ్య, ఈరలక్కప్ప, దీపిక, మక్బూల్ అహ్మద్, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అధికార ప్రతినిధి ఎంపీ గోరంట్ల మాధవ్, పీఏసీ సభ్యులు మాలగుండ్ల శంకరనారాయణ, మహాలక్ష్మి శ్రీనివాస్, అనంతపురం మేయర్ వసీం, టాస్క్ ఫోర్స్ సభ్యుడు రమేష్ గౌడ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల నాయక్, రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు పెన్నోబిలేసు, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కృష్ణవేణి, పార్టీ అనంతపురం నగర అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ముఖ్య అతిథులకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు స్వాగతం పలికారు. అక్కడే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సిద్దరాంపురం రోడ్డు మీదుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ సక్రమంగా నెరవేర్చలేదన్నారు. ప్రజలను మోసగించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రజలందరికీ గుర్తు చేయడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. 2019–24 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. 5 ఏళ్ల పాలనతో జగనన్న రాష్ట్రాన్ని పదేళ్లు ముందుకు తీసుకెళితే చంద్రబాబు ప్రస్తుత ఏడాది పాలనలో రాష్ట్రాన్ని 15 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, జెడ్పీటీసీలు భాస్కర్, భోగాతి ప్రతాప్‌రెడ్డి, నాయకులు నరేష్, సర్పంచ్ పార్వతి, పూల నారాయణస్వామి, నందినేని మల్లికార్జున, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బొమ్మన శ్రీరామిరెడ్డి, తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, రఘనాథరెడ్డి, ముత్యాల శీనా, పురుషోత్తం, పెద్ద కొండయ్య, చికెన్ నారాయణస్వామి, శ్రీనివాస రెడ్డి, ఆది, తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలను తిప్పికొట్టాలి



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడులకు పాల్పడడం పిరికిపంద చర్య అని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఖండించారు. అన్యాయంగా కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటామన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా చంద్రబాబు నుంచి గ్రామస్థాయి నాయకుల వరకు అవినీతి అక్రమాల్లో మునిగిపోయారన్నారు. హామీలు అమలు చేయకుంటే ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

కార్యకర్తలకు తోడుగా ఉంటా



వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక అధికార పార్టీ నాయకులు రెడ్ బుక్ మాటున అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. టీడీపీ వారు ఇసుక, ఎర్రమట్టి, రేషన్ బియ్యం దందా కోసం కొట్టుకుచస్తున్నారన్నారు. నాణ్యమైన చదువు, నాణ్యమైన మందులు, నాణ్యమైన భోజనం ఇస్తాం అని చెప్పిన ముఖ్యమంత్రులను చూశాం కానీ.. నేడు నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబును చూస్తున్నామన్నారు.

వ్యవస్థలు నాశనం



పోలీసు, రెవెన్యూ వ్యవస్థలను కూటమి సర్కారు నాశనం చేసిందని వైఎస్సార్ సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రతిపక్ష నేతలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కేసులు పెడతామని, భూములను లాక్కుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇలాంటి వాటికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడవద్దని అన్నారు. పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు. అధికారులు, పోలీసులుకు భారత రాజ్యాంగం ప్రకారమే ఉద్యోగాలు ఇచ్చారని, దానికి లోబడే పని చేయాలని హితవు పలికారు. రెడ్‌బుక్ ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తించి విమర్శలపాలు కావొద్దని పోలీసు అధికారులకు సూచించారు.

మహిళలకు రక్షణ కరువు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చాలా మంది బాలికలు మిస్సింగ్ అవుతున్నా మహిళా పక్షపాతి అని చెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాత్రం నోరుమెదపరన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బాలికలపై అత్యాచారాలు జరిగితే సీఎం, హోంమంత్రి, డిప్యూటీ సీఎం కానీ పరామర్శించిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టకపోయినా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు.

అమలుకాని ఆదేశాలు

- సబ్‌డివిజన్ కోసం రైతుల అగచాట్లు
- దరఖాస్తు రుసుం స్వీకరించని సచివాలయ సిబ్బంధి
- 30వ తేదీతో ముగియనున్న ప్రత్యేక డ్రైవ్

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం రైతులతో చెలగాటం ఆడుతోంది. ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. అధికారులు చెప్పారు కదా అని సచివాలయానికి వెళ్లిన రైతులకు అగచాట్లు తప్పడం లేదు. ఈ నిర్లక్ష్యం రీ–సర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రత్యేక సబ్‌డివిజన్ డ్రైవ్ అమలులో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. భూముల రీ–సర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలు సబ్‌డివిజన్ చేసుకునేందుకు 'ప్రత్యేక సబ్‌డివిజన్ డ్రైవ్' నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. సబ్‌డివిజన్‌కు సంబంధించి రూ.500 రుసుం మినహాయింపు పోగా దరఖాస్తు రుసుము నామమాత్రంగా రూ.50 సచివాలయంలో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ అవకాశం ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకున్నవారికే ఉంటుందని స్పష్టం చేశారు.



రుసుము స్వీకరణకు నో

సబ్‌డివిజన్ కోసం సచివాలయాలకు వెళ్లిన రైతుల నుంచి సిబ్బంది దరఖాస్తు రుసుం కట్టించుకోవడం లేదు. ఇది తమకు సంబంధం లేదని, రెవెన్యూ శాఖ చూసుకుంటుందని చెబుతుండడంతో రైతులు ఏమిచేయాలో దిక్కుతోచక వెనుతిరుగుతున్నారు. అధికారులేమో సచివాలయంలో చెల్లించాలని చెబుతున్నారు.. ఇక్కడికొస్తే మాకు సంబంధం లేదంటున్నారని రైతులు వాపోతున్నారు. ఈ పరిస్థితిని బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు–2 (బోడిగానిదొడ్డి) సచివాలయం పరిధిలోని రైతులు ఎదుర్కొన్నారు.

మిగిలింది మూడు రోజులే..

ప్రత్యేక సబ్‌డివిజన్ డ్రైవ్‌కు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఈ నెల 30తో ముగియనుంది. దరఖాస్తు చేసుకునేందుకు మూడు రోజులు మాత్రమే ఉంది. గడువు ముగిసిన తరువాత సబ్‌డివిజన్ చేసుకునేందుకు రైతు రూ.550 చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఒక రకంగా రైతుకు భారమే అవుతుంది.

రుసుము కట్టించుకోలేదు



మా గ్రామ పొలం సర్వే నంబరు 149లో 20.20 ఎకరాలు ఉంది. ఇందులో ఏడుగురు ఉన్నాం. రీ–సర్వేలో మా ఏడుగురికీ 20.20 ఎకరాలు ఉన్నట్లు చూపిస్తోంది. ఈ నెల 30లోగా రూ.50 రుసుము చెల్లించి సబ్‌డివిజన్‌కు దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రకటించడంతో.. సచివాలయానికి వెళ్లాం. అయితే అక్కడి సిబ్బంది రుసుం తీసుకోవడం లేదు. మాకు సంబంధం లేదని, అది రెవెన్యూ వాళ్ల పని అంటున్నారు.

– రైతు కిష్ట, బోడిగానిదొడ్డి, బుక్కరాయసముద్రం మండలం

రుసుం కచ్చితంగా స్వీకరించాలి



రీ–సర్వే జరిగిన గ్రామాల్లో సబ్‌డివిజన్ కోసం వచ్చిన రైతుల నుంచి దరఖాస్తు రుసుం నామమాత్రంగా రూ.50 తీసుకోవాలి. లేదని వెనక్కి పంపించడానికి వీలులేదు. రుసుం స్వీకరించేందుకు తిరస్కరించిన కొర్రపాడు–2 సచివాలయ సిబ్బందితో మాట్లాడతాను. జిల్లాలో ఇలాంటి పరిస్థితి ఎక్కడా తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– రూప్లానాయక్, ఏడీ, సర్వే భూ రికార్డుల శాఖ

చిత్తశుద్ధితో పనిచేయండి

అనంతపురం అర్బన్: ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఉత్తమ జిల్లాగా నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో సానుకూల అవగాహనపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రభావవంతంగా అమలు చేయాలన్నారు. సానుకూల అవగాహనపై జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓ, జిల్లా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.

అధికారుల పనితీరు మారాలి

'సేవలందించడంలో అధికారుల ప్రవర్తన సరిగాలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. మీ వైఖరి కారణంగా పలు అంశాల్లో జిల్లా ర్యాంకింగ్ తగ్గిపోతోంది. క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలులో అధికారుల పనితీరు, ప్రవర్తనలో మార్పు రావాలి' అని ఆదేశించారు. ప్రధానంగా రెవెన్యూ, సర్వే శాఖల పరిధిలో ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించేవారిపైనా, వైఫల్యం చెందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్

ఫైళ్లు పక్కాగా ఉండాలి

చుక్కల భూములు, 22ఏ జాబితా ఫైళ్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. చుక్కల భూముల క్లెయిమ్‌ల పరిష్కారంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా డాటెడ్ ల్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. 22ఏ (నిషేధిత భూముల) జాబితాలోని 12 క్లెయిమ్‌లను ఆమోదించారు. చుక్కల భూములకు సంబంధించి 24 ఆమోదించారు.

పీజీసెట్ ఫలితాల్లో సింధుప్రియకు రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు

ఉరవకొండ: పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు రామాంజినేయులు, జ్యోతి దంపతుల కుమార్తె బెల్దోన సింధుప్రియ ఏపీ పీజీసెట్ –2025 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల కోసం తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీ సెట్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. సింధుప్రియ పీజీ జువాలజీ ప్రవేశ పరీక్షలో 79 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించింది.



గూగూడు కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం



గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రథమదర్శనానికి తరలివచ్చిన భక్తులు

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి మొహర్రం ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తిరుమల కొండన్న వంశీయులు కుళ్లాయిస్వామి పీరును భద్రపరిచే పెట్టెను కిందకు దింపి.. సుగంధ ద్రవ్యాలతో శుభ్రం చేశారు. కుళ్లాయిస్వామి ప్రతిమకు, అగ్ని గుండానికి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరి దివిటీల వెలుగులో, సన్నాయి వాయిద్యాల నడుమ పట్టు వస్త్రాలు, బంగారు గొలుసుల నడుమ కుళ్లాయి స్వామి ప్రథమ దర్శనం భక్తులకు కల్పించారు.

ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

గూగూడు ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా గట్టి బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ జగదీష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన గూగూడు గ్రామాన్ని సందర్శించారు. అనంతరం ఆలయ పరిసరాలు, పికెట్లు, గ్రామంలోని రహదారులు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశులు, సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాశ అస్త్రం.. అథఃపాతాళం

లుక్.. అవుట్

- అనంతపురంలోనే 3 వేల మంది బాధితులు
- రూ.కోట్లు లూటీ చేశాక యాప్ క్లోజ్
- పోలీస్‌స్టేషన్లకు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

అనంతపురం: అత్యాశ అస్త్రానికి ఎందరో అమాయకులు బలయ్యారు. ఓ డొల్ల కంపెనీ ప్రవేశపెట్టిన 'లుక్' యాప్‌కు ఆకర్షితులైన వారు అందులో డిపాజిట్లు పెట్టి.. నిలువునా మోసపోయారు. రూ.కోట్లు కొల్లగొట్టి యాప్ క్లోజ్ చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. తమకు న్యాయం చేయండంటూ అనంతపురం నగరంలో సైబర్ విభాగానికి, ఆయా పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క అనంతపురం నగరంలోనే 'లుక్' బాధితులు మూడువేల మంది దాకా ఉన్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. సింహభాగం సైబర్ కాల్ సెంటర్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు. జాతీయ స్థాయిలో జరిగిన కుంభకోణం కావడంతో రికవరీకి ఎన్ని రోజులు పడుతుందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొనడంతో ఖాతాదారుల్లో ఆందోళన నెలకొంది.



అనంతపురంలో చిన్నారులకు ఉచిత పుస్తకాలు పంపిణీ చేస్తున్న 'లుక్' సభ్యులు (ఫైల్)

పక్కా కుట్ర..

'లుక్' పేరుతో యాప్ రూపొందించి వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం కల్పించారు. డబ్బు డిపాజిట్ చేస్తే ప్రతి వారం ఆదాయం పొందవచ్చని కొంతమంది యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా ప్రచారం చేయడంతో ఎక్కువమంది ఆకర్షితులయ్యారు. యాప్‌లో 9 రకాల స్కీంలు ప్రవేశపెట్టారు. రూ.2,250 నుంచి మొదలై .. గరిష్టంగా రూ.75.6 లక్షల వరకు డిపాజిట్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. యాప్‌లో చేరిన వారందరికీ ఒక వాట్సాప్ గ్రూపులో చేర్చి ఎప్పటికప్పుడు స్కీంల సమాచారాన్ని పోస్ట్ చేస్తూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే 17 వేల నుంచి 20 వేల మంది సభ్యులు ఉన్నారు. యాప్‌లో చేరిన వారికి అనుమానం రాకుండా తొలుత పక్కాగా చెల్లింపులు చేశారు.

సేవా కార్యక్రమాల పేరుతో గాలం

నిర్వాహకులు యాప్‌కు ప్రచారం కల్పించడానికి సరికొత్త మార్గాలను అన్వేషించారు. విస్తృతంగా సభ్యులుగా చేరిన ప్రాంతాలను ఎంపిక చేసి.. ఆయా ప్రాంతాల్లో పేదలకు నిత్యావసర సరుకులు, పుస్తకాలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. అనంతపురంలోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం

లుక్ యాప్ పేరుతో జరిగిన మోసానికి బలైన బాధితులు ఫిర్యాదులు చేస్తున్నారు. బాధితులు సైబర్ క్రైం సెల్‌తో పాటు ఆయా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు. నేర తీవ్రతను బట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

–షేక్ జాకీర్ హుస్సేన్, సైబర్ క్రైం సీఐ

సీఆర్‌ఎంటీలకు బదిలీ టెన్షన్

- రీ–ఆర్గనైజేషన్ అనంతరం జిల్లాలో 20 బీ క్లస్టర్ స్కూళ్లు
- సర్దుబాబు పేరుతో సొంత మండలాల్లో కాకుండా దూర మండలాలకు పంపే ప్రయత్నం
- లబోదిబోమంటున్న సీఆర్‌ఎంటీలు


మాజీ ఏఎంసీ చంద్రశేఖర్‌రెడ్డితో మాట్లాడుతున్న సీఆర్‌ఎంటీలు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష పరిధిలో పని చేస్తున్న క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ల (సీఆర్‌ఎంటీ)కు 'బీ కాంప్లెక్స్'ల బదిలీ టెన్షన్ పట్టుకుంది. జిల్లాలో మొన్నటి వరకు మొత్తం 155 క్లస్టర్లు ఉండేవి. కూటమి ప్రభుత్వం రీ–ఆర్గనైజేషన్ ప్రక్రియ చేపట్టడంతో వివిధ నిబంధనలతో వాటిని 135కు కుదించారు. దీంతో మిగులుగా ఉండే సీఆర్‌ఎంటీఎల్లో గుబులు రేగుతోంది. తమను ఎక్కడికి సర్దుబాటు చేస్తారోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

సర్దుబాటు పేరుతో అన్యాయం

1 నుంచి 10 తరగతులు ఉన్న క్లస్టర్ స్కూళ్లలో కొత్తగా 'బీ క్లస్టర్లు' తీసుకొచ్చారు. ఇలా జిల్లాకు 20 బీ క్లస్టర్ స్కూళ్లు వచ్చాయి. అయితే ఇవన్నీ ప్రస్తుతం పని చేస్తున్న మండలాల్లో కాకుండా పక్క మండలాల్లో ఎక్కువగా ఉండడంతో సీఆర్‌ఎంటీలు భయపడుతున్నారు. అనంతపురం అర్బన్ పరిధిలో 12 కాంప్లెక్స్‌లుంటే ఆరు రద్దయ్యాయి. మరో నాలుగు కొత్తగా వచ్చాయి. అంటే మొత్తం 10 క్లస్టర్ స్కూళ్లు ఉన్నాయి. ఇక్కడ 12 మంది సీఆర్‌ఎంటీలు పని చేస్తున్నారు. మిగులుగా ఉన్న ఇద్దరిని పక్క మండలాల్లో సర్దుబాటు చేయాల్సి ఉంది. సమీపంలో అంటే గార్లదిన్నె మండలంలో ఒక బీ క్లస్టర్ స్కూల్ ఉంది. మరొకటి దరిదాపుల్లో లేదు. అలాగే నార్పల మండలంలో ఒక సీఆర్‌ఎంటీ మిగలగా, చుట్టుపక్కల మండలాలైన శింగనమల, బుక్కరాయసముద్రం, అనంతపురంలో ఖాళీలు లేవు. చాలా మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొందని బాధిత సీఆర్‌ఎంటీలు వాపోతున్నారు.

జీతం అక్కడ...పని ఇక్కడ!

మరోవైపు సీఆర్‌ఎంటీలు ప్రస్తుతం ఎక్కడ పని చేస్తున్నారో అదే మండలాల్లోనే ఉంటారని జీతం సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్తగా 'బీ కాంప్లెక్స్'లను తీసుకొచ్చిందని అధికారులు చెబుతున్నారు. మిగులుగా ఉన్న సీఆర్‌ఎంటీలు బీకాంప్లెక్స్‌కు కేటాయించినా జీతాలు అక్కడ తీసుకుంటూ పని మాత్రం ప్రస్తుతం చేస్తున్న చోటే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీనిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. భవిష్యత్తులో ప్రతి నెలా ఇక్కడ పని చేస్తూ జీతాలు వేరే మండలాల ఎంఈఓలు చేయాలంటే ఏమి అడ్డంకులు చెబుతారోనని ఆందోళన అందరిలోనూ వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో నామమాత్రంగా ఉన్న బీక్లస్టర్ల అవసరం లేదని నివేదికలు సిద్ధంచేసి, వాటిని తీసేస్తే తమ పరిస్థితి ఏమి కావాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పలువురు సీఆర్‌ఎంటీలు శుక్రవారం సమగ్రశిక్ష కార్యాలయానికి వచ్చారు. ఏపీసీ శైలజ అందుబాటులో లేకపోవడంతో మాజీ ఏఎంసీ చంద్రశేఖర్‌రెడ్డిని కలసి తమగోడు వెళ్లబోసుకున్నారు. తమకు ఎలాంటి ఇతరత్రా అలవెన్సులు ఉండవని, నామమాత్రపు జీతాలతో పని చేస్తున్న తమను దూర మండలాలకు పంపితే ఇబ్బంది పడతామని వాపోయారు. బీక్లస్టర్ స్కూళ్లకు మ్యాపింగ్ చేసి, పనిమాత్రం ప్రస్తుతం ఉన్నచోట చేయాలని చెబుతున్నా భవిష్యత్తులో ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయాలతో తాము ఇబ్బందులు పడతామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ప్రతి విద్యార్థికీ విద్యా సామగ్రి అందాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు వెంకట శివసాయి

ఆత్మకూరు: ప్రభుత్వం అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా సామగ్రి ప్రతి ఒక్క విద్యార్థికి తప్పనిసరిగా అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ పరిశీలకుడు వెంకట శివసాయి సూచించారు. ఆత్మకూరులోని ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించరాదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత

రాప్తాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేసులు తెలిపారు. సోమందేపల్లికి చెందిన నరేష్ 42 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కర్ణాటకలోని పావగడకు బొలెరో వాహనంలో తరలిస్తూ శుక్రవారం రాప్తాడులోని వైఎస్సార్ సర్కిల్‌లో పట్టుబడ్డాడన్నారు. వాహనాన్ని సీజ్ చేసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు వివరించారు.

పశు శాఖ జేడీగా సుధాకర్



అనంతపురం సెంట్రల్: పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ టీవీ సుధాకర్‌ను నియమిస్తూ ఆ శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత జేడీ వెంకటస్వామి ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

రేషన్‌కు నగదు బదిలీ ఆలోచన మానుకోవాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

రాయదుర్గంటౌన్: ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా లబ్ధిదారులకు రేషన్‌కు నగదు బదిలీ చేయాలనే ఆలోచనను మానుకోవాలని కూటమి ప్రభుత్వానికి సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి హితవు పలికారు. స్థానిక ఏపీఎన్జీఓ భవనంలో శుక్రవారం రాయదుర్గం, కణేకల్లు, డి.హీరేహాళ్ మండలాల సీపీఎం నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నల్లప్ప మాట్లాడుతూ.. రేషన్ బియ్యం పథకాన్ని కచ్చితంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. నగదు బదిలీ చేస్తే నిజమైన లబ్ధిదారులు, పేదలు నష్టపోతారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున, నాగరాజు, లోకేష్, నాగరాజు, మధు, తిమ్మరాజు, శంకర్, పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు పి.నారాయణస్వామితో కలసి విలేకరులతో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునే అంశాన్ని టీడీపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఉంచిందని గుర్తు చేశారు. హామీని అమలు చేయకపోతే బాధితులతో కలిసి మరోసారి ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధేశ్వర్, జిల్లా అధ్యక్షుడు నారాయణప్ప, సభ్యులు కుళ్లాయప్ప, ధనుంజయ, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌లో నేడు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలకు శనివారం అనంతపురంలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 896 సచివాలయాలు ఉండగా అంతే సంఖ్యలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లను కేటాయించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టి సంఖ్యను కుదించింది. దీంతో 534 సచివాలయాలు మాత్రమే మనుగడలో ఉన్నాయి. ఈ లెక్కన ఐదేళ్లు పూర్తయిన వారు 315 మంది, ఐదేళ్ల కంటే తక్కువ సర్వీసు కలిగిన వారు 147 మంది ఉన్నారు. ఖాళీలు 72 ఉన్నట్లు తేల్చారు. రద్దు కానున్న 362 సచివాలయాల స్థానంలో అంతే సంఖ్యలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సంఖ్యనూ కుదించనున్నారు. బదిలీల ప్రక్రియపై శుక్రవారం పంచాయతీరాజ్ ఎస్‌ఈ జహీర్ అస్లాం మాట్లాడుతూ.. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. బదిలీల కోసం అడ్డదారుల్లో ఎవరూ ప్రయత్నించరాదని, దళారీలను నమ్మబోరాదని సూచించారు.

పరిశ్రమల ఏర్పాటుతోనే జిల్లాభివృద్ధి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: పరిశ్రమల ఏర్పాటుతోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేయడంతో పాటు కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. సింగిల్ విండో పోర్టల్ ద్వారా అనుమతుల మంజూరు చేయాలన్నారు. జలశక్తి మిషన్ ద్వారా పరిశ్రమల్లో నీటిని పరిరక్షించేందుకు చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అనంతరం ఎల్‌డీఎం ఆధ్వర్యంలో జిల్లా వార్షిక ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, పరిశ్రమల అధికారి శ్రీనివాసయాదవ్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ దేవకాంతమ్మ, పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి, ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో 'టీసీసీ' ఫలితాలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షల ఫలితాలు www.bre.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డ్రాయింగ్, హ్యాండ్లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు రాసిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో మార్కుల జాబితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్షల సంచాలకుల కార్యాలయం నుంచి మార్కుల జాబితాలు జిల్లాకు రాగానే సమాచారం తెలియజేస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి

- ఎస్పీ జగదీష్ ఆదేశం



అనంతపురం అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. రోడ్డు భద్రతపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్‌ఓ ఎ.మలోలతో కలసి ఎస్పీ మాట్లాడారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పరిమితికి మించి ప్రయాణికులను చేర వేసే వాహనాలే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. ప్రమాదాలకు గల కారణాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, త్రిబుల్ రైడింగ్ అతి వేగంగా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

19 వేల మందిపై కేసు నమోదు

ఈ ఏడాది మే1వ తేదీ నుంచి ఈ నెల 24వ తేదీ వరకూ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన 19,982 మందిపై కేసులు నమోదు చేసినట్లు డీటీసీ వీర్రాజు తెలిపారు. వీరిలో హెల్మెట్ ధరించకుండా డ్రైవింగ్ చేసిన 544 మంది, ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపిన 749 మంది, డ్రైవింగ్ లైసెన్స్.. ఆర్‌సీ.. ఇతర ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన 13,892 మంది, మద్యం సేవించి వాహనాలు నడిపిన 282 మంది ఉన్నారన్నారు. వీరికి రూ.56,96,885 జరిమానా విధించినట్లు వివరించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రాజగోపాల్, జాతీయ రహదారి శాఖ పీడీ తరుణ్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ జహీర్ అస్లాం, ఆర్‌టీసీ ఆర్‌ఎం సుమంత్, డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు చర్యలు

మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. నార్కో కో–ఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలో ప్రత్యేకంగా ఈగల్ టాస్క్‌ఫోర్స్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

బోడాయిపల్లిలో వేటకొడవళ్లతో స్వైరవిహారం


తీవ్రంగా గాయపడిన కుళ్లాయప్ప, రంగనాథ్

తాడిపత్రి టౌన్: మండలంలోని బోడాయిపల్లిలో శుక్రవారం ఉదయం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని వేటకొడవళ్లతో దాడులు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన కుళ్లాయప్ప, అదే గ్రామానికి చెందిన రంగనాథ్ భార్యపై దాదాపు ఏడాది క్రితం అత్యాచారయత్నం చేశాడు. ఆ సమయంలో గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని పంచాయితీ నిర్వహించి కుళ్లాయప్పపై ఏడాది పాటు గ్రామ బహిష్కరణ విధించారు. ఏడాది పూర్తి కావడంతో కుళ్లాయప్ప గ్రామానికి చేరుకుని తన సోదరుడు బాలయ్యతో కలిసి గ్రామ సమీపంలోని పొలంలో శుక్రవారం ఉదయం పనుల్లో నిమగ్నమైన సమయంలో రంగనాథ్‌తో పాటు రాజేష్, రంగ సుధాకర్, పృథ్వీ, రాకేష్, హరీంద్ర మరో ముగ్గురు అక్కడకు చేరుకుని వేటకొడవళ్లు, కర్రలతో దాడికి తెగబడ్డారు. దాడిని ప్రతిఘటిస్తూ తనకు అందుబాటులో ఉన్న వేటకొడవలితో కుళ్లాయప్ప కలబడ్డాడు. ఘటనలో కుళ్లాయప్ప కాలుకు, చేతిపై నరుకుడు గాయాలయ్యాయి. రంగనాథ్ తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఇరువురి పరిస్థితి విషమంగా మారింది. బాలయ్య, రాజేష్, రంగసుధాకర్, పృథ్వీ, హరీంద్రకు చిన్నపాటి రక్తగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకుని దాడులను అడ్డుకుని క్షతగాత్రులను తొలుత తాడిపత్రిలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న సీఐ శివగంగాధర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

మట్కా రాస్తున్న మహిళల అరెస్ట్

తాడిపత్రి టౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మట్కా రాస్తున్న ముగ్గురు మహిళలను అరెస్ట్ చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం తనిఖీలు చేపట్టి పక్కా ఆధారాలతో సరస్వతి, కుళ్లాయమ్మ, జ్యోతిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1.30 లక్షల నగదు, సెల్‌ఫోన్లు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అనుమానాస్పద మృతి


మృతుడు అభిషేక్‌కుమార్

అనంతపురం: నగరంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న అభిషేక్‌కుమార్ (20) గురువారం రాత్రి బాత్‌రూంలో వాంతి చేసుకుని మృతి చెందాడు. సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని వన్‌టౌన్ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ విచారణ చేపట్టారు. బీహార్‌లోని వెస్ట్ చంపారన్ జిల్లా బహుర్వా గ్రామానికి చెందిన సీతాదేవి, శంభురామ్ దంపతుల చిన్న కుమారుడు అభిషేక్ కుమార్ ఇంటర్ పూర్తి చేసి రెండు నెలల క్రితం ముంబయిలోని యూనీ సర్వేడ్ టెక్ సొల్యూషన్స్ కంపెనీలో నెట్‌వర్క్ టెక్నీషియన్‌గా పనిలో చేరాడు. శిక్షణ అనంతరం కంపెనీ ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీ నుంచి అనంతపురం కేంద్రంగా విధులు చేపట్టాడు. శ్రీకంఠం సర్కిల్‌లోని పీజీ హాస్టల్‌లో ఉంటూ విధుల్లో భాగంగా యాడికి సమీపంలోని పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ చెకింగ్‌కు వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో శుక్రవారం విధులు ముగించుకుని వస్తూ మార్గమధ్యంలో తన స్నేహితుడు జయప్రకాష్‌కుమార్ రాయ్‌తో కలసి గోబీ మంచూరియా తిని సాయంత్రం హాస్టల్‌కు చేరుకున్నాడు. రాత్రి 7గంటలకు జయప్రకాష్ పిలిచినా భోజనానికి వెళ్లలేదు. కాసేపటి తర్వాత భోజనం గదిలోకి తెచ్చి పెట్టి తినమని జయప్రకాష్ తెలపడంతో ఆరోగ్యం ఇబ్బందిపెడుతుంటే మందులు వేసుకున్నానని అలాగే నిద్రపోయాడు. రాత్రి 8:15 గంటలకు బాత్‌రూంకు వెళ్లిన అభిషేక్ అక్కడ వాంతులు చేసుకుంటూ కుప్పకూలాడు. గమనించిన జయప్రకాష్‌కుమార్ వెంటనే తన రూంమేట్స్ నాగూర్ వలి, పోతులయ్య, పీజీ హాస్టల్ యజమాని నాగేశ్వరరెడ్డితో కలసి ఆటోలో సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అభిషేక్‌కుమార్ మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ అభిషేక్ బావ రూపేష్‌రామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనంతపురం వన్‌టౌన్ పీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో గందరగోళం


ఆందోళన చేస్తున్న సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు

అనంతపురం కార్పొరేషన్: సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో తీవ్ర గందరగోళం నెలకొంది. శుక్రవారం బదిలీలు చేపట్టాలని ఆగమేఘాలపై సర్క్యులర్ విడుదలైంది. ముందురోజు అర్ధరాత్రి 11 గంటలకు సంబంధిత ఉద్యోగులకు ఫోన్ ద్వారా సమాచారం తెలపడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నగరపాలక సంస్థ, 11 మున్సిపాలిటీల పరిధిలో విధులు నిర్వర్తించే సచివాలయ ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అనంతపురంలోని జీసస్‌నగర్‌లోని జయమణెమ్మ కళ్యాణమంటపంలో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి నేతృత్వంలో వివిధ మునిసిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది.

స్పష్టతలో జాప్యం : ఉమ్మడి జిల్లాలో 304 సచివాలయాల పరిధిలో 286 మంది అడ్మిన్ పోస్టులుండగా.. అందులో 18 ఖాళీలున్నాయి. కౌన్సెలింగ్‌కు 176 మంది అడ్మిన్‌లు హాజరయ్యారు. మునిసిపల్ ఆర్‌డీ విశ్వనాథ్ ఎవరైనా ఏదైనా మునిసిపాలిటీ పరిధిలో 5 ఏళ్ల పాటు పని చేసి ఉన్న వారు బదిలీకి అర్హులని చెప్పారు. దీంతో దీనిపై స్పష్టత రాలేదు. అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోని 74 సచివాలయాల్లో పది మందికిపైగా బిల్ కలెక్టర్లు అడ్మిన్‌లు చేస్తున్నారు. ఈ సచివాలయాలను బదిలీల జాబితాలో చూపలేదు. మునిసిపాలిటీల్లో వివిధ సచివాలయాల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న కొందరినీ పరిగణనలోకి తీసుకోకపోవడంతో సచివాలయ ఉద్యోగులు అభ్యంతరం తెలిపారు. ఇతర మునిసిపాలిటీల్లో ఈ విధంగా జరగడం లేదన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు మునిసిపల్ ఆర్‌డీ విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేశారు. మరోసారి బదిలీ జాబితాను పక్కాగా నమోదు చేసి బదిలీలు చేపట్టాలని కమిషనర్ బాలస్వామిని ఆర్‌డీ ఆదేశించారు. దీంతో గంటసేపు పైగా బదిలీల కౌన్సిలింగ్ నిలిపివేశారు.

తమ్ముళ్ల సిఫార్సు : బదిలీల్లో తెలుగు తమ్ముళ్ల సిఫార్సు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా నియోజకవర్గ ప్రజాప్రతినిధుల లెటర్లతో కొందరు బదిలీలకు రావడంతో వివిధ మునిసిపాలిటీల్లోని కొన్ని ప్రాంతాలను అధికారులు ఖాళీలు చూపనట్లు తెలుస్తోంది. దీంతో అర్హులైన ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

అడ్మిన్ బదిలీల కౌన్సెలింగ్ రసాభాస.. వాయిదా : అడ్మిన్ బదిలీల కౌన్సెలింగ్ రసాభాసగా సాగింది. శుక్రవారం రాత్రి ఉద్యోగుల ర్యాంక్, స్పౌజ్‌ల విషయంలో గందరగోళం నెలకొంది. పారదర్శకంగా చేపట్టడం లేదంటూ అడ్మిన్ కార్యదర్శులు ఆందోళన చేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఆర్‌డీ విశ్వనాథ్ బదిలీల కౌన్సెలింగ్ వద్దకు చేరుకున్నారు. బదిలీలు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారని, తమకు అన్యాయం జరుగుతోందంటూ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బదిలీల కౌన్సెలింగ్‌ను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు ఆర్‌డీ విశ్వనాథ్ ప్రకటించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


గౌతమి

తాడిపత్రి టౌన్: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు తాడిపత్రిలోని శ్రీసాయి చైతన్య స్కూల్ విద్యార్థిని గౌతమి ఎంపికైంది. ఈ మేరకు కోచ్ నరసింహ శుక్రవారం వెల్లడించారు. అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి జూలై 5వ తేదీ వరకూ ఉత్తరాఖాండ్‌లోని హరిద్వార్‌లో జరిగే జాతీయ స్థాయి అండర్–18 బాలికల విభాగం పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టులో చోటు దక్కించుకున్న గౌతమిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు అభినందించారు.

క్లుప్తంగా

'మానవీయం' కవితా సంపుటి రేపు ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: ప్రముఖ కవి ఉమ్మడి శెట్టి అవార్డు వ్యవస్థాపకుడు డాక్టర్ రాధేయ రచించిన 'మానవీయం' కవితా సంపుటిని ఆదివారం ఆవిష్కరించనున్నారు. స్థానిక ఆర్ట్స్ కాలేజ్ కామర్స్ సెమినార్ హాలులో ఉదయం 10 గంటలకు జరగనున్న కార్యక్రమానికి విజయవాడ అడిషనల్ ఎస్పీ, ప్రముఖ కవి లోసారి సుధాకర్ జిల్లా సాహితీవేత్తలతో కలిసి హాజరవుతారన్నారు. సాహితీ అభిమానులందరూ విచ్చేయాలని ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్టు, ఆంధ్రభారతి ప్రతినిధులు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ఏఓకు వీడ్కోలు



ఏఓ ఉదయ్ కుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఉదయ్ కుమార్ కర్నూలు జిల్లా డోన్‌కు బదిలీ అయ్యారు. శుక్రవారం వ్యవసాయాధికారి కార్యాలయంలో ఉదయ్ కుమార్‌కు సన్మాన సభ నిర్వహించారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది ఆయన్ను శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని దామాజిపల్లి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లెసెన్స్, కాలుష్యం తదితర రికార్డులను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు లెసెన్స్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు.

సమయపాలన పాటించాలి

అనంతపురం మెడికల్: విధి నిర్వహణలో అందరూ అంకితభావంతో పని చేయాలి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విధుల్లో ఉండకపోతే చర్యలు తప్పవని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారం హెచ్‌ఓడీలను హెచ్చరించారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్న ఆయన తొలిసారిగా శుక్రవారం హెచ్‌ఓడీలతో సమావేశమయ్యారు. రోగులకందించే సేవల్లో నాణ్యత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకందే సేవల్లో నిర్లక్ష్యం కనిపించకూడదన్నారు. ఓపీ సమయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, తదితరులు తప్పక హాజరుకావాలన్నారు. సమావేశంలో అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

దీప స్తంభాల వితరణ

ఆత్మకూరు: పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన ఎన్ఆర్ఐ రాజేశ్వరి తన సోదరుడు శంకర్‌రెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం దీప స్తంభాలు వితరణ చేశారు. దీప స్తంభాల విలువ రూ.లక్ష ఉంటుందని ఆలయ ఈఓ బాబు తెలిపారు.


విజేత ఏఎన్ఆర్ జట్టు



టోర్నీలో పాల్గొన్న ఫొటో గ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు

అనంతపురం: దాగురే ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ నాగమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఫైనల్‌లో డీజే టీం, ఏఎన్ఆర్ జట్లు తలపడ్డాయి. ఫైనల్‌లో ఏఎన్ఆర్ జట్టు విజయం సాధించింది.

దండిణీ అవతారంలో వాసవీమాత



అలంకరణలో వాసవీమాత

అనంతపురం కల్చరల్: ఆషాఢ మాసంలో సాగుతున్న వారాహి నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు స్థానిక కొత్తూరు అమ్మవారి శాల శుక్రవారం రాత్రి వందల సంఖ్యలో పోటెత్తిన మహిళా భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి నామస్మరణతో ప్రతిధ్వనించింది. మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మలమ్మ నేతృత్వంలో వాసవీ మాతను దండిణీ అలంకారంలో ఆరాధించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు వారాహి అష్టోత్తరం, వారాహి కవచం, వారాహి స్తుతి, వారాహి ద్వాదశ నామస్తోత్రంతో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. మరో ఏడు రోజుల పాటూ వారాహి నవరాత్రులు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం



ఆత్మకూరులో గుండం వద్ద గుద్దిలి వేస్తున్న దృశ్యం



రాప్తాడు: అలంకరణలో జల్లమ్మ స్వామి (ఫైల్)

ఆత్మకూరు: కులమతాలకు అతీతంగా జరుపుకునే మొహర్రం వేడుకలకు శుక్రవారం రాత్రి అంకురార్పణ చేశారు. ఆత్మకూరు పీర్ల చావిడి దగ్గర డప్పుచప్పుళ్ల మధ్య గుండం వద్ద చదివింపులు చేసిన అనంతరం గుద్దిలి వేశారు. గుద్దిలి వేయడంతో మొహర్రం పండుగ ప్రారంభమైంది. పకీర్లు అయ్యే వారు సాంప్రదాయంగా పండుగ ముగిసే రోజు వరకు అంటే పీర్ల స్వాములు జలధికి తరలే వరకు మాంసాహారం ముట్టరు. 30వ తేదీన పెట్టె మెరవణి చేసి రాత్రికి పీర్ల చావిడిలో పీర్లను కొలువుదీరుస్తారు. జూలై 2వ తేదీన స్వాములను వెండి ఆభరణాలతో అలంకరిస్తారు. 4వ తేదీన చిన్న సరిగెత్తు, 5వ తేదీన విడిదినం, 6వ తేదీన పెద్ద సరిగెత్తు జరుగుతాయి. 7వ తేదీ తెల్లవారుజామున పీర్లకు గ్రామోత్సవం నిర్వహించి.. తిరిగి అదే రోజున జలధికి తరలిస్తారు. 9వ తేదీన స్వామి వారి చివరి దర్శనం ఉంటుంది.

భక్తుల కొంగుబంగారం సర్దార్‌వలి దర్గా..

ఆత్మకూరులో వెలసిన సయ్యద్ సర్దార్‌వలి దర్గాను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. సర్దార్‌వలి దర్గాలో మొక్కుకుంటే తప్పకుండా నెరవేరుతుందని భక్తుల నమ్మకం. పండుగలో భాగంగా చాలా మంది భక్తులు స్వామికి మొక్కుబడిగా చెక్కర చదివింపులు, వెండి గొడుగులు సమర్పిస్తారు. మరి కొంత మంది ఒక్కొక్కటి రూ.10 వేలు విలువ చేసే పూల హారాలను బెంగళూరు నుంచి తెప్పించి స్వామికి అలంకరిస్తారు. చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తు రోజున పాకనం చేసి పీర్లకు చదివింపులు చేయిస్తారు. ఆత్మకూరు మండలం నుంచే కాకుండా జిల్లా వ్యాప్తంగా భక్తులు మొహర్రం వేడుకల్లో పాల్గొంటారు.

కులమతాలకు అతీతంగా ఉత్సవాలు

రాప్తాడు: మండల వ్యాప్తంగా మొహర్రం వేడుకలకు అనుమతి పొందేందుకు గ్రామాల ప్రజలు పోలీస్‌స్టేషన్లకు పరుగులు పెడుతున్నారు. భోగినేపల్లి, గొందిరెడ్డిపల్లి, ఎం.బండమీదపల్లి, హంపాపురం, గంగలకుంట, మరూరు, జి.కొత్తపల్లి తదితర గ్రామాల్లో శనివారం నుంచి మొహర్రం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆయా గ్రామాల్లో గుండం ముందు గుద్దిలి వేసి ఉత్సవాలకు శ్రీకారంచుడతారు. గొందిరెడ్డిపల్లి లో వెలసిన జల్లమ్మ స్వామికి భక్తులు పెద్ద సరిగెత్తు రోజున పెద్ద ఎత్తున చక్కర చదివింపు కార్యక్రమం నిర్వహిస్తారు. జల్లమ్మ బావి వద్ద ఉన్న దర్గా వద్దకు వందలాది మంది మహిళలు, భక్తులు ఊరేగింపుగా వెళ్లి పూజలు చేస్తారు. ఈ సందర్భంగా చక్కర చదివింపు కార్యక్రమానికి వచ్చిన భక్తులు బస్తాల కొద్ది చక్కెరను తెచ్చి సమర్పిస్తారు. జల్లమ్మ స్వామి పేరు మీద నిలిపిన పీరుకు భక్తులు చదివింపులు చేసి కానుకలు అందజేస్తారు. ఆయా గ్రామాల్లో పెద్ద సరిగెత్తును మండల ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. మొక్కుబడుల సమర్పణ పర్వం రాత్రి మొత్తం జరుగుతుంది. రాత్రి కార్యక్రమం అనంతరం మరుసటి రోజు వేకువజామున 4 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగిస్తారు. అదేరోజు సాయంత్రం పీర్ల చావిడీల నుంచి పీర్లను ఊరేగింపుతో ఏటికి (ఊరి చివరకు) తీసుకెళ్తారు. పీర్లను విప్పి ముటకట్టి విషాద గీతాలను పాడుకుంటూ వస్తారు. ఈ తంతుతో మొహర్రం ఉత్సవాలు ముగుస్తాయి.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి..



ఏడు రోజుల పాటు జరిగే మొహర్రం ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి. ఇందుకోసం గ్రామ పెద్దలు ముందస్తుగా పోలీసులు అనుమతి తీసుకోవాలి. మండలంలో గణేష్ ఉత్సవాలను ఎలా ప్రశాంతంగా నిర్వహించుకుంటారో అదేవిధంగా మొహర్రం ఉత్సవాలు జరగాలి. పీర్ల ఏర్పాటుకు అనుమతులు ఉన్న నిర్వాహకులకు ఇప్పటికే సూచనలు చేశాం. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు.

– శ్రీహర్ష, సీఐ, రాప్తాడు

సేంద్రియ ఎరువులు తయారు చేయాలి

● జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈఓ శివ శంకర్

రాప్తాడు: ప్రస్తుతం సేంద్రియ ఎరువులకు భారీగా డిమాండ్ పెరిగింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా పరిషత్ సీఈఓ శివ శంకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఎం.బండమీదపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్మికులు ఇంటింటికీ వచ్చి చెత్త సేకరిస్తున్నారా లేదా అని గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ముఖ్యంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పంచాయతీ కార్మికులు వారికి కేటాయించిన ఇళ్లల్లో రోజూ తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారో లేదో సర్పంచ్, పంచాయతీ అధికారులు ఉదయమే పరిశీలించాలన్నారు. ఏ రోజు చెత్త ఆ రోజే సేకరించాలన్నారు. గ్రామాల్లో చెత్త పేరుకుపోతే దోమలు దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడతారని హెచ్చరించారు. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. పంచాయతీ కార్మికులు సేకరించిన చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మి కంపోస్ట్ ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కుళ్లాయి నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాయపల్లిలో అదృశ్యం.. బెంగళూరులో ప్రత్యక్షం



విద్యార్థిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఏఎస్ఐ శ్రీరాం నాయక్

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని కళాకారుల కాలనీకి చెందిన బాదుల్లా, తులసి దంపతుల కుమారుడు పునీత్ కుమార్ ఈనెల 21వ తేదీన అదృశ్యం అయిన విషయం విదితమే. విద్యార్థి అదృశ్యంపై తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ టీవీ.శ్రీహర్ష కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి అనంతపురంలో ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో గాలించారు. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆలయాల దగ్గర గాలించినా విద్యార్థి ఆచూకీ లభ్యం కాలేదు. ఏఎస్ఐ శ్రీరాం నాయక్ హిందూపురంతో పాటు బెంగళూరు నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. ఎట్టకేలకు బెంగళూరు రైల్వే స్టేషన్‌లో విద్యార్థి ఆచూకీ లభ్యం కావడంతో విద్యార్థిని తహసీల్దార్ విజయకుమారి ఎదుట తల్లిదండ్రులకు ఏఎస్ఐ శ్రీరాం నాయక్ అప్పగించారు. కుమారుడిని తమ చెంతకు చేర్చడంతో తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి ఆచూకీ కనుగొన్న ఏఎస్ఐ శ్రీరాం నాయక్‌ను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు ప్రత్యేకంగా అభినందించారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



మునిసిపల్ ఆర్డీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: ఏపీ మునిసిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జరుగుతున్న సమ్మె శుక్రవారం 8వ రోజుకు చేరింది. యూనియన్ నాయకులు, కార్మికులు ఉదయం నగరపాలక సంస్థ నుంచి మునిసిపల్ ఆర్డీ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఆర్డీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. మార్గ మధ్యంలో కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మునిసిపల్ ఆర్డీ కార్యాలయంలో ఆర్డీ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వేతనాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మునిసిపల్ ఆర్డీ విశ్వనాథ్ తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లోకేష్ నాయుడు, నాయకులు నూర్ బాషా, నల్లప్ప, తిరుమలరెడ్డి, కే.నారాయణ రెడ్డి, పెద్దన్న, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు



బైక్ నడుపుతున్న ఎస్పీ పి.జగదీష్

అనంతపురం: అత్యాధునిక టెక్నాలజీ కలిగిన 22 నూతన ద్విచక్ర వాహనాలను ఎస్పీ పి.జగదీష్ సిబ్బందికి అందజేశారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో పూజ నిర్వహించిన అనంతరం సిబ్బందికి హెల్మెట్‌తో పాటు ప్రతి టూవీలర్‌కు జీపీఎస్ సిస్టం, సైరన్, నైట్ విజన్ లైట్స్, ప్రజల్ని అప్రమత్తం చేస్తూ ట్రాఫిక్ క్లియరెన్స్‌కు ఉపయోగపడే మైక్ అమర్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 20 టీవీఎస్ అపాచీలు, రెండు రాయల్ ఎన్‌ఫీల్డ్ టూ వీలర్లను సిబ్బందికి అందజేయడం జరిగిందన్నారు. శాంతిభద్రతల సమస్యలు, అవాంఛనీయ ఘటనలు తలెత్తినప్పుడు.. ట్రాఫిక్ స్తంభించిన సమయాల్లో క్లియర్ చేయడానికి ఇవి బాగా దోహదపడతాయని తెలిపారు. అనంతరం జిల్లా స్పెషల్ పార్టీ సిబ్బందికి యూనిఫాం (జంగిల్ డ్రెస్), పీటీ డ్రెస్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, జాఫర్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

1975 ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం



పరుచూరి రమేష్‌ను సన్మానిస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ భావజాలాన్ని, దేశభక్తిని అణిచివేయడం కోసం 1975లో కాంగ్రెస్ సర్కార్ విధించిన ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం అని ఏబీవీపీ నాయకులు వాపోయారు. ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్థానిక సత్య సాయి ఆర్ట్స్, సైన్స్ బాలికల జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుమన్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అధికార దాహం కోసం యావత్ దేశాన్ని మొత్తం ఇబ్బందుల్లోకి నెట్టిన సంఘటన ఎమర్జెన్సీ అన్నారు. అనంతపురం విభాగ్ కార్యవాహ జగదీశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ లాంటి చీకటి రోజులు తిరిగి ఈ దేశంలో పునరావృతం కాకుండా విద్యార్థులు, సమాజాన్ని చైతన్యవంతులను చేయాలన్నారు. ఎమర్జెన్సీ సమయంలో జైలు జీవితాన్ని గడిపిన పరుచూరి రమేష్ తన అనుభవాలు, సంఘటనలను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్ రెడ్డి, నాయకులు గణేష్, భరత్ రెడ్డి, దివాకర్ నాయక్, హరి, కుమార్ పాల్గొన్నారు.

నేడు సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో సచివాలయాల ఉద్యోగుల బదిలీలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. శనివారం ఉదయం 9 గంటలకు జీసస్ నగర్‌లోని జయమణెమ్మ కళ్యాణ మంటపంలో వార్డు ఎడ్యుకేషన్ వారికి, మధ్యాహ్నం 2 గంటలకు వెల్ఫేర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా తపోవనం సర్కిల్‌లోని పుష్ప ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు వార్డు శానిటేషన్, మధ్యాహ్నం 2 గంటలకు వార్డు అమినిటీస్‌కు బదిలీలు చేపట్టనున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థలో ఉదయం 9 గంటలకు వార్డు ప్లానింగ్ కార్యదర్శులకు బదిలీల కౌన్సిలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

సజ్జలను కలసిన బెడుదూరు



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని రాప్తాడు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బెడుదూరు గోపాలరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుక్కరాయసముద్రంలో శుక్రవారం జరిగిన 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమానికి సజ్జల హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాలరెడ్డి కలిశారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగిన సబ్ జూనియర్, జూనియర్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. క్యోరుగి విభాగంలో గుజ్జల యోగ చర్విత (బంగారు), ఎ.జనిత్‌కుమార్ (బంగారు), జి.హర్షవర్ధన్‌రెడ్డి (రజతం), వి.శ్రీభవిష్య (రజతం), ఎస్. దేవాన్ష్ రెడ్డి (కాంస్యం), జి. శ్రీనివాస్‌కళ్యాణ్ (కాంస్యం) పతకాలను సాధించారు. అలాగే పూంసే విభాగంలో..బి.నివేద్, ఎస్‌బీ ఉమామహేష్, బి.నితేష్ కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

10న గురుపౌర్ణమి వేడుకలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అనంతపురంలో సాయిబాబా మందిరంలో దశాబ్దాలుగా సాయినాథుడి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వీటిని కొనసాగించడానికి అందరూ కృషి చేయాలని సాయి మందిరాల రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్ర చౌదరి సూచించారు. శుక్రవారం నగరంలోని వేమనా టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో గురు పౌర్ణిమ వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. జూలై 10న గురుపౌర్ణిమ సందర్భంగా పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం సామూహిక విష్ణు సహస్రనామార్చన, సామూహిక సాయిసత్యవ్రతాలు, అన్న సంతర్పణ జరుగుతాయని అందరూ పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు. కార్యక్రమంలో మందిర కమిటీ కార్యవర్గ సభ్యులు వెంకటస్వామి, రవీంద్రనాథ్, రాఘవేంద్రగుప్తా, నాగానందం, వెంకటేశ్వర్లు, భార్గవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

గార్లదిన్నె: ఆర్థిక ఇబ్బందులు తాళలేకో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కల్లూరులోని కొండకింద కొట్టాల ప్రాంతానికి చెందిన యల్లప్ప (50)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. నైటీల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వ్యాపారం కొనసాగించలేక అప్పుల పాలయ్యాడు. దీనికి తోడు కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న యల్లప్ప శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మార్చిలోపు ఇళ్లు పూర్తి చేస్తేనే బిల్లులు

కూడేరు: వచ్చే ఏడాది (2027)మార్చి లోపు పక్కా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుంటేనే బిల్లులు అందుతాయని హౌసింగ్ డీఈ హనుమప్ప లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం ఆయన ముద్దలాపురం, కూడేరులోని జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం దాటితే బిల్లులు రావని, లబ్ధిదారులు నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జూలై 3వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులందరూ హాజరుకావాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఇప్పటి వరకు కొందరు అధికారులు హాజరుకాకుండా తమ కింది స్థాయి సిబ్బంది హాజరవుతున్నారన్నారు. 3న జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు. హాజరు కాని అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

రేపు బ్రాహ్మణ ఐక్యవేదిక

అనంతపురం కల్చరల్: బ్రాహ్మణులందరిని ఏకతాటిపైకి తెచ్చి సంఘటితం చేయడమే లక్ష్యంగా రాయలసీమ బ్రాహ్మణ ఐక్యవేదిక ఏర్పాటవుతున్నట్లు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఏఎల్ఎస్ శాస్త్రి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీన స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం వేదికగా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీలు, శాఖలకు అతీతంగా అందరూ తరలి వచ్చి ఐక్యత చాటుకోవాలని కోరారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్: కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు బెంగుళూరులో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఉన్నతి పౌండేషన్ అడ్మిషన్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ (పాస్, ఫెయిల్) అభ్యర్థులు అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు బెంగుళూరులో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ సంస్థలో వందశాతం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వివరించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9000487423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

14 నుంచి బీబీ ఫాతిమా ఉత్సవాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: మహిమాన్వితమైన బీబీ ఫాతిమా ఉత్సవాలను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఐదవ రోడ్డులోని బీబీ ఫాతిమా దేవస్థానం ప్రాంగణంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. జూలై 14 నుంచి 20వ తేదీ వరకు అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు పెట్టె మెరవణి, అగ్నిగుండంతో ఆరంభమై 17న చిన్నసరిగెత్తు, 19న పెద్ద సరిగెత్తు, 20న జలధికి పోవడం, 22న చివరి దర్శనం ఉంటాయని పేర్కొన్నారు. రోజూ వందలాది మందితో చక్కెర చదివింపులు, మొక్కుబడులతో జాతర జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున, నరసింహులు, నవీన్‌కుమార్, మురళీ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల కోసం దరఖాస్తు చేసుకోండి

రాప్తాడు: మండలంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ కింద పండ్ల మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ సావిత్రి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్న, సన్న కారు రైతులు మామిడి, సపోట, దానిమ్మ, చీనీ, మునగ, సీతాఫలం, బత్తాయి, జామ, అల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు మరికొన్ని పండ్ల మొక్కలు పెంచుకోవచ్చన్నారు. ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భక్తిమార్గంతోనే ఉత్తమ జీవితం



పూజలు చేస్తున్న వేదవర్ధన తీర్థులు

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక మార్గం మనిషిని మానసిక ప్రశాంతతో పాటూ ఉత్తమ విలువలు నేర్పుతుందని ఉడుపి సిరూరు మఠాధిపతి వేదవర్ధన తీర్థులు అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా పాతూరు ఉత్తరాధిమఠానికి విచ్చేసిన ఆయన వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం సంస్థాన పూజలు, పాద పూజలు సాగాయి. ఉడుపిలోని అష్టమఠాల్లో ఒకటైన సిరూరు మఠానికి వచ్చే జనవరి నుంచి ఉడుపి ఆరాధన పర్యాయం వస్తుందని తెలిపారు. రెండేళ్లపాటూ అక్కడే ఉంటున్నట్లు వెల్లడించారు. రాత్రి తొట్లోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, రాత్రి ఫలహార సహిత తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. మఠం మేనేజర్ వినోదాచార్ మాట్లాడుతూ.. స్వామి శనివారం మధ్యాహ్నం వరకు ఉత్తరాధిమఠంలోనే ఉంటారన్నారు. ప్రత్యేక పూజలు, అనుగ్రహ భాషణం ఉంటాయన్నారు.